క్లుప్తంగా

నగరంలో తొలిరోజే 90 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని అన్ని డివిజన్లలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. నగరంలో 19,259 పింఛన్లు ఉండగా వీటిలో 17,337 పింఛన్లను వలంటీర్లు గురువారం సాయంత్రానికల్లా అందజేసి 90.02 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఇంకా 1922 మందికి పింఛన్లను అందజేస్తే నూరుశాతం పంపిణీ పూర్తవుతుంది. పింఛన్ల పంపిణీలో నగరం జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది.

బందరు డీఎస్పీగా రాంబాబు

కోనేరుసెంటర్: బందరు డీఎస్పీగా జావాంగుల రాంబాబును నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఎస్పీగా పనిచేసిన మాసుం బాషా అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతిపై వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీఎస్పీగా దిశ డీఎస్పీ యు.నాగరాజును జిల్లా ఎస్పీ పి.జాషువా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా గుంటూరు నార్త్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న రాంబాబును బందరు సబ్ డివిజన్‌కు డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో రాంబాబు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

ఎన్ఎస్ ఎస్ అంటే మార్కులు కాదు మార్పు

కోనేరుసెంటర్: ఎన్ఎస్ఎస్ అంటే మార్కులు కాదు మార్పు అని, దానిలో భాగస్వామ్యం అవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ శిక్షణ సమన్వయకర్త ఆచార్య ఎన్‌డీ పాల్ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకునే వేదికే ఎన్ఎస్ఎస్ అన్నారు. రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ఎస్ఎస్‌కు గుర్తింపు తీసుకురావడంలో ఆచార్య పాల్ పాత్ర ఎంతో వుందని అలాంటి వ్యక్తితో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ అధికారులను ఆయన అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యుడుదర కృష్ణ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం 5వ తేదీకి వాయిదా

నాగాయలంక: ప్రభుత్వం డీఆర్‌డీఏ–డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం నాలుగో విడత ఆసరా పథకం నిధులకు సంబంధించిన చెక్కుల పంపిణీ ఈనెల 5వ తేదీకి వాయిదా పడినట్లు మండల వెలుగు ఏపీఎం కె.వై.దాసు గురువారం చెప్పారు. 3న జరగాల్సిన ఈ కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు. రేమాలవారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డులో 5వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే సభలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని 1121 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, సంబంధిత అధికారులు, వెలుగు సిబ్బంది పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

105 మద్యం సీసాలు స్వాధీనం



బంటుమిల్లి: మండల పరిధిలోని ములపర్రు ఏఎంసీ చెక్‌పోస్ట్ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమ మద్యం సీసాలు ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎ.పైడిబాబు తెలిపిన సమాచారం మేరకు రోజువారీ తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్ట్ వద్ద గుడివాడ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన పెయ్యల పోలు, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికి చెందిన పెనుమాల వెంకటేశ్వరరావు, బంటుమిల్లికి చెందిన గరికముక్కు ప్రకాశరావులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పలు కంపెనీలకు చెందిన 105 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. రామవరపుమోడి గ్రామంలో కాపు సారా ఉందని అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేయగా సారా అమ్ముతున్న వ్యక్తి పారిపోగా అతని వద్ద ఉన్న 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతని అధీనంలో ఉన్న బెల్లపుఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పైడిబాబు, సిబ్బందిని పెడన సీఐ హమీద్‌బాషా అభినందించారు. గూడూరు ఎస్ఐ శేషుకుమార్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలంలో సారా అమ్ముతున్న ఓ మహిళను బందరు రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పల్లె తుమ్మలపాలెం గ్రామానికి చెందిన మహిళ సారా అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయగా పది లీటర్ల సారాతో పోలీసులకు ఆమె పట్టుబడింది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు.

జగనన్న గెలుపు పేదవాడి గెలుపు

ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్



అవనిగడ్డలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు, వికాస్ తదితరులు

అవనిగడ్డ: రానున్న ఎన్నికలు పెత్తందారులకు పేదలకు మధ్య యుద్ధం అని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు పేదల గెలుపని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో నాలుగవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. మండలంలోని 7,635 మంది వైఎస్సార్ క్రాంతి పథం సభ్యులకు రూ.9.35 కోట్ల విలువైన ఆసరా చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా అందుకున్న వారిలో అన్ని పార్టీల మహిళలు ఉన్నారని, పార్టీ జెండాలు చూడకుండా అందరికీ పథకాలు అందించిన జగన్‌ని అందరివాడుగా భావించి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. జగన్ బటన్ నొక్కడం తప్ప చేసిందేమీ లేదని ప్రతిపక్ష పార్టీ నాయకులకు మీ గ్రామంలో సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే, నాడు–నేడు స్కూల్ భవనాలు చూపించి ఆ విమర్శలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కోట్లు ఖర్చుపెట్టి పెద్ద పెద్ద భవనాలు కట్టడం అభివృద్ధి కాదని పేదల బతుకుల్లో మార్పు తీసుకురావడం కూడా అభివృద్ధేనని అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో చంద్రబాబు రైతుల భూములకు చుక్కలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చుక్కలను తీయించి రైతులకు గొప్ప మేలు చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు చాలా వరకూ నెరవేరాయని, అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం ద్వారా రోగులకు సేవలందిస్తున్నారని, ఎదురుమొండి –ఏటిమొగ వారధికి నాబార్డు ద్వారా నిధులు మంజూరయ్యాయని టెండర్ల దశ పూర్తవగానే శంకుస్థాపన పనులు చేపడతామన్నారు. అవనిగడ్డలో డంపింగ్ యార్డు తరలింపునకు ఆదేశాలు వచ్చినా వేరే ప్రాంతానికి వెళ్లకుండా జనసేన నేతలు ప్రజలను రెచ్చగొట్టి అడ్డుకుంటున్నారని చెప్పారు. అవనిగడ్డ –కోడూరు రహదారి సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, దానిని కూడా త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయమని అడుగుతున్నామని, ప్రతిపక్ష పార్టీలకు వారు చేసిన పనులు చూసి ఓటేయమని చెప్పే ధైర్యం లేదని ఎమ్మెల్యే సింహాద్రి ఎద్దేవా చేశారు. తొలుత ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, పార్టీ యువనేత సింహాద్రి వికాస్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ తుంగల సుమతీదేవి, అవనిగడ్డ, రామకోటిపురం సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, లక్ష్మీతిరుపతమ్మ, ఎంపీటీసీలు గోళ్ళ కృష్ణకుమారి, మేడికొండ విజయలక్ష్మి, బడే రమాదేవితో పాటు పలువురు మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏసీ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ షేక్ నజీర్‌బాషా, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వను

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్



గాంధీనగరంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ మహేష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

కృత్తివెన్ను: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకముంచి అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేస్తానని ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ అన్నారు. చైర్మన్‌గా ఎంపికైన మహేష్‌ను గురువారం యండపల్లి పంచాయతీ గాంధీనగరం గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో ప్రతి పల్లెకు ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తానన్నారు. తనపై ఇంతటి ఆప్యాయతను చూపిన గ్రామస్తులకు, ముఖ్యమంత్రి జగనన్నకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. అంతకు ముందు చైర్మన్‌ను గ్రామస్తులు గజమాల, దుశ్శాలువా, పూల కిరీటంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాజీ, మాజీ సర్పంచ్ నరసింహారావు, బీజేపీ నాయకుడు వెంకట శ్రీనివాస్, ఉపసర్పంచ్ అంజలి, స్థానిక పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చ పత్రిక కథనం పచ్చి అబద్ధం

- ప్రాణం ఉన్నంత వరకు పేర్ని కుటుంబంతోనే ఉంటాం
- అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు



మాట్లాడుతున్న మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ

కోనేరుసెంటర్: రాజకీయంగా ప్రాణం ఉన్నంత వరకు తామంతా పేర్ని కుటుంబంతోనే నడుస్తామని, పార్టీలో చీలికలు తెచ్చేందుకు పచ్చ పత్రికలో ఎన్ని అసత్యాలు ప్రచురించినా తమకు గానీ, తమ పార్టీకి గానీ ఎటువంటి నష్టం జరగదని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అచ్చేబా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు దుర్మార్గమైన ఆలోచనలు చేస్తోందన్నారు. అందుకోసం మరింత దిగజారిపోతుందన్నారు. మచిలీపట్నం నుంచి పదుల సంఖ్యలో కార్పొరేటర్‌లు ఎంపీ బాలశౌరి వెంట నడిచేందుకు సిద్ధపడుతున్నారంటూ ఎల్లో మీడియా ప్రచురించిన కథనంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. గత 30 ఏళ్లుగా పేర్ని కుటుంబంతో కలిసి రాజకీయాల్లో నడుస్తున్న కుటుంబాలు తమవని, తమకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు అడ్డుపడేందుకు తమ నాయకుడు పేర్ని నాని ఉన్నారన్నారు. అటువంటి నాయకుడిని వదిలి ఎంపీ చెంతన చేరేంతగా దిగజారలేదన్నారు. పేర్ని కుటుంబం అధికారంలో ఉన్నా లేకున్నా తామంతా ఆ కుటుంబం వెంటే నడుస్తాం తప్ప మరెవరి చెంతకు వెళ్లే ప్రసక్తే లేదన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బందరు ప్రాంత అభివృద్ధి పేర్ని కుటుంబానికే సాధ్యపడుతుందన్నారు. బందరు పోర్టు, మెడికల్ కళాశాల, హార్బర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు పేర్ని నాని చలవతోనే జరుగుతున్నాయన్నారు. ఎల్లో మీడియా తమ పార్టీపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ తామంతా మాట తప్పని మడమ తిప్పని నాయకుడి పార్టీలో పనిచేస్తున్నామని, తాము కూడా ఆయన స్ఫూర్తితో పార్టీలో కొనసాగుతామే తప్ప వేరే ఆలోచన ఉండదని చెప్పారు. మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మాట్లాడుతూ పచ్చ పత్రికలో అవాస్తవాలు రాస్తే తీవ్ర పరిణామాలు చూడాల్సి వస్తుందన్నారు. ప్రాణం పోయినా తమ నాయకుడిని వదిలి వేరే పార్టీ చెంతకు వెళ్లే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మేకల సుబ్బన్న, శీలం మారుతీరావు, గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో గురుకుల బాలికల ప్రతిభ



విద్యార్థినులను సత్కరిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గురుకుల బాలికలు ప్రతిభ చూపటం అభినందనీయమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. ఇటీవల అవనిగడ్డలో జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో చల్లపల్లి ప్రభుత్వ గురుకుల పాఠశాల బాలికలు మూడవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక గ్రామ సచివాలయం–1 వద్ద క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడిపాముల అరుణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పీఈటీ దేవీ పద్మజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కలతోటి సుధాకర్, మహిళా పోలీసులు వేమూరి లావణ్య, సైకం నాగలక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ విజేతలకు డీఈఓ ప్రశంస



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో తాహెరాసుల్తానా

చిలకలపూడి(మచిలీపట్నం): సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌లో బహుమతులు సాధించిన ముగ్గురు విద్యార్థులను డీఈవో తాహెరాసుల్తానా గురువారం అభినందించారు. దక్షిణ భారత స్థాయిలో బహుమతులు సాధించిన కంచడం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి విశ్వనాథ్, మేడూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గోపాలకృష్ణ, విజయేంద్రకుమార్‌లకు డీఈవో ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

టెన్నికాయిట్‌లో సత్తా చాటిన మల్లవోలు విద్యార్థులు



గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం పాండురంగ హైస్కూలులో నిర్వహించిన జిల్లా సెలక్షన్స్‌లో మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గురువారం జరిగిన జిల్లా జట్టు సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన త్రినాథ్, చరణ్ అత్యుత్తమ ప్రదర్శన కనపరిచి జంగారెడ్డిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, పి.రవీంద్రబాబులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కాసాని అరుణ అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌గా నియమితులైన తోట వెంకట సతీష్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సతీష్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా నియమితులయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్

కలెక్టర్ పి.రాజాబాబును మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.తదనంతరం జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో పెద్ది రోజాలను కూడా కలిశారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని 8వ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన పామర్తి వాకలయ్య గుండె సమస్యతో స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం చిన్నా వలంటీర్ పద్మతో కలిసి ఆసుపత్రికి వెళ్లి వాకలయ్యకు పింఛను సొమ్మును అందజేశారు. ఆసుపత్రికి వచ్చి పింఛను సొమ్మును అందించిన కార్పొరేటర్ చిన్నా వలంటీర్ పద్మలకు వాకాలయ్య, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మరో ఘటనలో డివిజన్‌కు చెందిన అన్నపూర్ణ పక్షవాతంతో బాధపడుతూ మంగినపూడి సమీపంలోని సత్రపాలెంలో బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శ్రీరాం చిన్నా వలంటీర్ జోసెఫ్‌తో కలిసి వెళ్లి అన్నపూర్ణకు పింఛను మొత్తాన్ని అందజేశారు.

వైద్య ఖర్చులకు రూ.5వేలు ఆర్థిక సహాయం

కోడూరు: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన వెంకట సాంబశివరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో అవనిగడ్డకు చెందిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు తోట శ్యామ్‌కిషోర్‌నాయుడు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు, విస్సంశెట్టి బాపనయ్య, మోపిదేవి కోటేశ్వరరావు, కైతేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 2వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మాచవరం, దేవునిచెరువు, కోతిబొమ్మసెంటర్, పెడన బైపాస్‌రోడ్డు, వలందపాలెం, నేలగిరి, జెడ్పీ సెంటర్, పట్టాభిపురం, గంగులతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రూ.10 వేల తక్షణ సాయం అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని 26వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన అంకాని శ్రీను కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన తక్షణ సాయం రూ.10 వేలను మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో గృహసారథులు రమణయ్య, శివయ్య పాల్గొన్నారు.

3న సిద్ధం సభను విజయవంతం చేయండి

నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము)



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పాల రాము

పెడన: ఈ నెల 3వ తేదీన ఏలూరులో ఎన్నికల శంఖారావం కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము)కోరారు. పట్టణ పరిధిలోని 4,5 వార్డు సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఏలూరు బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్నికల శంఖారావం పూరిస్తారని చెప్పారు. సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేసేందుకు సచివాలయాల పరిధిలో ఉన్న వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లేందుకు వలంటీర్లు కృషి చేయాలని రాము విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్ కటకం ప్రసాదు, వైస్ చైర్మన్ ఖాజా, 4,5 సచివాలయాల పరిధిలోని వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కృత్తివెన్ను మండలంలో పర్యటన

కృత్తివెన్ను: పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల సాధనకు అనుగుణంగా మనమంతా కలసి నడవాల్సిన సమయం ఆసన్నమైందని పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. ఈ నెల 3వ తేదీన ఏలూరులో జరగనున్న సిద్ధం మహాసభ విజయవంతం కోసం ఆయన గురువారం మండల పరిధిలోని ఇంతేరు, చినపాండ్రాక గ్రామాలలో పర్యటించి ప్రజలను సమాయత్తం చేశారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలంటే మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పి.మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్‌లు మోకమ్మ, బాయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వడ్డి కాసులు, అగ్రికల్చరల్ జిల్లా బోర్డు సభ్యుడు పట్టపు నాని పాల్గొన్నారు.

బదిలీలు అయిన తహసీల్దార్లకు ఘన సత్కారం



బదిలీ అయిన తహసీల్దార్ విమలకుమారిని సన్మానించిన సిబ్బంది, వీఆర్వోలు



మోపిదేవిలో తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

నాగాయలంక: ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న బదిలీలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం తహసీల్దార్ ఎం.సుందరరాజును నాగాయలంక తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జాలాది విమలకుమారిని అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న విమలకుమారిని గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తలగడదీవి గంగాధర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, మండలంలోని రేషన్ డీలర్లు, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

మోపిదేవి: రాజమండ్రికి బదిలీపై వెళుతున్న మోపిదేవి తహసీల్దార్ కూరపాటి నవీన్‌కుమార్‌ను గురువారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ సునీల్, వీఆర్వోలు, వీఆర్ఏలు, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లిలో...

చల్లపల్లి: ఎన్నికల బదిలీల్లో భాగంగా కోనసీమ జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ గోపాలకృష్ణకు గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెడనలో...

పెడన: ఎన్నికల బదిలీల్లో భాగంగా రిలీవ్ అవుతున్న తహసీల్దార్ మధుసూదన్‌రావును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గరికపాటి రామానాయుడు గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను శాలువతో సత్కరించి బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, చేవెంద్ర పంచాయతీ ఉపసర్పంచ్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీఓలు

బంటుమిల్లి: బంటుమిల్లి ఎంపీడీఓగా జీవీఎస్ రామకృష్ణంరాజు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న జె.స్వర్ణభారతిని పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ రామకృష్ణంరాజును కార్యాలయ సూపరింటెండెంట్ శర్మ, ఈఓపీఆర్‌డీ కె.త్రిపురసుందరి, సిబ్బంది బొకే అందజేసి అభినందనలు తెలిపారు. బంటుమిల్లి తహసీల్దార్ ఎంవీ సత్యన్నారాయణను ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరుగా బదిలీ చేశారు.

చల్లపల్లి ఎంపీడీఓగా నాగలక్ష్మి

చల్లపల్లి: మండల నూతన ఎంపీడీఓగా ఎస్.నాగలక్ష్మి నియమితులయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె ఏఓ శ్యాంసన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి సమీక్ష సమావేశ నిర్వహణ కోసం వచ్చిన డీఎల్‌పీఓ ఐ.జ్యోతిర్మయి ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓను అభినందించారు. ఈఓఆర్డీ అశోక్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, సిబ్బంది ఎంపీడీఓకు స్వాగతం పలికి సత్కరించారు.

తాగునీటిపై సమీక్ష:

అనంతరం డీఎల్‌పీఓ జ్యోతిర్మయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల వారీగా తాగునీటి అవసరాలపై సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నులు, కుళాయి ఫీజులపై సమీక్ష చేశారు.

గూడూరు ఎంపీడీఓగా ప్రేమాన్విత

గూడూరు: గూడూరు ఎంపీడీఓగా నియమితులైన ఎన్.ప్రేమాన్విత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ప్రేమాన్వితను గూడూరు ఎంపీడీఓగా ప్రభుత్వం నియమించింది. అంతకుముందు ఎంపీడీఓగా పనిచేస్తున్న డి.సుబ్బారావు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన బుధవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు.

బాగా చదివి ఉన్నత స్థానం సాధించాలి



మోపిదేవి జెడ్పీపాఠశాల 75వ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గావాణి

మోపిదేవి: ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానం సాధించాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల 75వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాగా చదువుకుంటేనే సమాజం గౌరవిస్తుందని, దానివల్ల పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం ప్రతి తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తొలుత ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉదయం గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాఠశాల ప్రగతిని చదివి వినిపించారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి రావి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రావి ప్రభుదాసు, కోశాధికారి కావూరి కోదండరామయ్య, నందిగం అభిషేకరావు, కంఠంనేని కుటుంబరావు, కనగాల రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నం కమిషనర్‌గా బాపిరాజు



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గురువారం ప్రస్తుత కమిషనర్ జి.చంద్రయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఏలూరులో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బాపిరాజు ఇక్కడకు రాగా ఆ స్థానానికి చంద్రయ్య బదిలీపై వెళ్లారు. కమిషనర్‌గా వచ్చిన బాపిరాజు 1995లో తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు ప్రారంభించారు. ఆ తరువాత 2001 నుంచి గ్రేడ్–3 కమిషనర్‌గా ఎంపికై నాన్ లోకల్ కోటాలో సిరిసిల్ల, మంచిర్యాల, పాల్వంచ, బోధన్, భద్రాచలం, అమలాపురం, పెద్దాపురం, శ్రీకాకుళం, ఏలూరుల్లో పనిచేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి తాను అధిక ప్రాధాన్యం ఇస్తానని కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బాపిరాజు 'సాక్షి'కి తెలిపారు. నగర ప్రజలు తమ పరిధిలోని సమస్యలను ఫిర్యాదు చేస్తే ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు, విద్యుత్ దీపాల సమస్య లేకుండా చూసేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

నాగాయలంక: స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ మిత్ర బృందం సభ్యుడు పొన్నూరు భాను ఆధ్వర్యంలో నాగాయలంక ఆశ్రమంలో గురువారం వృద్ధులకు అన్నదానం చేశారు. భాను పుట్టినరోజు పురస్కరించుకుని తొలుత వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పంచారు. ఆశ్రమ నిర్వాహకుడు తలశిల మనోహర్, బండ్రెడ్డి హరి, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు చిట్టా శేఖర్, మునగాల కుటుంబరావు, యర్రంశెట్టి నాగపవన్ పాల్గొన్నారు.